క్లుప్తంగా

రోడ్డుపైనే ఆటోల నిలిపివేత



కొట్టాం సెంటర్లో ఇష్టారాజ్యంగా నిలిపిన ఆటోలు

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పండుగ రోజులు కావడంతో ప్రయాణికులతో బస్టాండ్ సెంటర్ రద్దీగా ఉంటున్న నేపథ్యంలో ఆటోవాలాలు ఆటోలను ఎక్కడికక్కడ నిలిపి ప్రయాణికుల రాకపోకలకు విఘాతం కలిగిస్తున్నారు. ముఖ్యంగా కొట్టాం సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా ఆటోలను నిలిపి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆటోవాలాల తీరుపట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆటోలను రోడ్డుపై నిలిపివేసి ట్రాఫిక్ సమస్య సృష్టిస్తున్న ఆటో డ్రైవర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



లింగంపర్తిలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న సుబ్బారావు, గ్రామస్తులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శనివారం పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక వేత్త ఆలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగపరుస్తున్న కార్మికులను సన్మానించడం మన బాధ్యతన్నారు. కార్యక్రమంలో వాగు బాబులు, వుడతల రమణారావు, అడపా వీరభద్రరావు, గవరసాని పెదకాపు, చెదల వీరబాబు, చలంశెట్టి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'చదలవాడ' కు పలువురి పరామర్శ



చదలవాడ బాబీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు చదలవాడ బాబీని శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, ఎంపీపీ తోట రవి పరామర్శించారు. బాబీ తల్లి చిన్నాదేవి వృద్ధాప్యంతో శుక్రవారం మృతి చెందారు. దీంతో బాబీ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం



కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న మురళీ కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన తోపాటి శ్రీనివాస్, పులి వెంకటేష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా వారిని శనివారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



ఎ.కొత్తపల్లిలో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మూర్తి, రమేష్ తదితరులు

తొండంగి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని మాలమహానాడు నాయకుడు పీఎస్ఎన్ మూర్తి, విశ్రాంత ఐఏఎస్, ఏపీ మాజీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం రాత్రి బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడిగా అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నేటి యువతకు ఆయన ఆదర్శప్రాయుడన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు నూతలపాటి సోనీవుడ్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చైర్మన్ కె.బాబ్జి, బి.ఎలియాజర్, సీహెచ్.రాజశేఖర్, పి.హరిరామ్‌ప్రసాద్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్రాంతి పందేలకు రెఢీ!

- గ్రామాల్లో కోడి పందేలకు బరులు సిద్ధం
- రూ.వేలల్లో కోడిపుంజుల ధరలు
- జూదాలు వద్దంటూ పోలీసులు విస్తృతంగా ప్రచారం



తలపడుతున్న కోడి పుంజులు (ఫైల్)

తుని రూరల్: పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పెద్ద పండగ సమీపించడంతో కోడి పందేలు, గుండాట, పేకాట రాయుళ్లలో ఉత్సాహం ఉరకలేస్తుంది. జూదాలు వద్దు.. సాంప్రదాయ క్రీడలే ముద్దు అంటూ పోలీసులు విస్తత ప్రచారం చేస్తున్నా పందెం రాయుళ్లు వాటిని పట్టించుకోవడం లేదు. జూదారుల కోసం నిర్వాహకులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో పందేలు నిర్వహణకు గ్రామస్థాయి నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో ఈ సంవత్సరం బరుల సంఖ్య ఘననీయంగా పెరిగే అవకాశం ఉంది. కొన్ని గ్రామాల్లో గుండాట, ఆహార పదార్థాలు, శీతల పానియాల దుకాణాలు ఏర్పాటుకు రూ.లక్షల్లో వేలం నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పండగ పర్వదినాల్లో పందేలకు అనువుగా కోడి పుంజులను సిద్ధం చేసి కొంతమంది విక్రయిస్తున్నారు. జాతి, రంగును బట్టి ఒక్కొక్క కోడిపుంజు ధర రూ.ఐదు వేల నుంచి రూ.లక్ష వరకూ పలుకుతోంది.

నియోజకవర్గంలో 35 బరులు

నియోజకవర్గంలో కోడి పందేలు నిర్వహించేందుకు సుమారు 35కిపైగా బరులను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. తుని, కోటనందూరు, తొండంగి మండలాల పరిధిలో 60 పంచాయతీల్లో 50 గ్రామాలు ఉన్నాయి. ప్రధాన గ్రామాల్లో కోడిపందేలు, గుండాట, పేకాట శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. ఇలా నియోజకవర్గం వ్యాప్తంగా 35కిపైగా శిబిరాలు ఏర్పాటు కానున్నట్టు సమాచారం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో బరులు సిద్ధం చేసే పనుల్లో నాయకులు ఉన్నారు. ఎక్కడికక్కడ పందేలు జరిగే అవకాశం ఉండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే పందెంరాయుళ్ల సంఖ్య తక్కువగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లి పండగకు సొంతూళ్లకు వచ్చే వారితోనే సరిపెట్టుకోవలసి వస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఏదేమైనప్పటికీ మూడు రోజులు జరిగే కోడిపందేలు, గుండాట, పేకాట శిబిరాల్లో రూ.కోట్ల లావాదేవీలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.



తుని మండలంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కోడి పుంజులు

భారీగా బైండవర్ కేసులు

కోర్టు ఆదేశాల మేరకు జూదాలు నివారించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. జూదాలు వద్దని, కబడ్డీ, ముగ్గుల పోటీలే సంప్రదాయమని పోలీసులు విస్తతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఆటోలపై తిరుగుతూ హెచ్చరిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో హెచ్చరికలు చేస్తూ ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. పాత రికార్డుల ఆధారంగా నిర్వాహకులు, కత్తులు కట్టే వారిని బైండవర్ చేస్తున్నారు. అవసరమైతే కేసులు నమోదు చేసి అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

జూదాలాడితే కఠిన చర్యలు



సంక్రాంతి పండగ నేపథ్యంలో జూదాలు ఆడితే కఠిన చర్యలు తప్పవు. కోడిపందేలు, గుండాట, పేకాట ఆడేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. నియోజకవర్గంలో ఇప్పటికే 122 మందిని బైండవర్ చేశాం. మరికొంత మందిపై కేసులు నమోదు చేస్తాం. మూడు నాలుగు గ్రామాలకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం. జూదాలతో విలువైన కాలాన్ని, డబ్బును వృథా చేయకుండా సంప్రదాయ క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహణకు గ్రామీణులకు పోలీసులు సహకరిస్తున్నారు.

జి.చెన్నకేశవరావు, సీఐ, తుని రూరల్

సంక్రాంతికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

తుని: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13 వరకూ తుని డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు స్థానిక డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, నర్సీపట్నం ప్రాంతాలకు ప్రయాణికుల సౌకర్యార్థం స్పెషల్ బస్సులను నడుపుతున్నామన్నారు. ఈ బస్సుల్లో సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తున్నట్లు చెప్పారు. తుని, అన్నవరం బస్టాండ్లు, తుని గొల్లప్పారావు సెంటర్లలో ఆర్టీసీ సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేసి బస్సులను పంపించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తుని: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేలు, గుండాట, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ హెచ్చరించారు. తునిలో శనివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కోడి పందేల నిర్వాహకులు, కోడి కత్తులు తయారీదారులు, జూదరులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. లాడ్జీల్లో పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు సంప్రదాయ పద్ధతిలో పండుగను జరుపుకోవాలన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రయాణాలు, మార్కెట్‌కు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులు జీవితాన్ని ఆనందంగా గడపాలి



కేరింతలు కార్యక్రమంలో అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

తుని: విద్యార్థులు ఆశలు, ఆకాంక్షలు కలిగి జీవితాన్ని ఆనందంగా గడపాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అధ్యయన కేంద్రం (సీఏపీఎస్) ప్రాజెక్ట్ సమన్వయకర్త వోలేటి సత్యనారాయణ సూచించారు. స్థానిక శ్రీప్రకాష్‌లో శనివారం జరిగిన కేరింతలు ముగింపు కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పినట్టు విద్యార్థులు సింహం వంటి గుండె ధైర్యం, సాహసం కలిగి ఉండాలని, అటువంటి వారిని మాత్రమే విజయం వరిస్తుందన్నారు. కన్నబిడ్డల భవిష్యత్ కోసం తమ వర్తమానాన్ని త్యాగం చేస్తున్న తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తెచ్చి ఉత్తమ పౌరులుగా విద్యార్థులు ఉండాలన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితమైతే ఒత్తిడి పెరిగి మానసిక సంఘర్షణకు లోనవుతారన్నారు. ఆట పాటలతో కూడిన విద్యను శ్రీప్రకాష్ అందిస్తుందన్నారు. సంక్రాంతి సంబరాలతో ప్రారంభమైన కేరింతలు కార్యక్రమం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ముగిసింది. విద్యార్థుల ఆట పాటలు, బృందగానం, ప్రదర్శనలు అందరినీ అలరించాయి. శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, కార్యదర్శి అజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, కన్వీనర్ టి.సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాచారం ఇస్తే భద్రత కల్పిస్తాం




మాట్లాడుతున్న ఎస్సై కృష్ణమాచారి

తుని రూరల్: సంక్రాంతి పండగ నేపథ్యంలో సొంతూళ్లు, బంధువుల ఇంటికి వెళ్లే వారు తమకు సమాచారం తెలియజేస్తే భద్రత కల్పిస్తామని తుని రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి పేర్కొన్నారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సమాచారం అందించిన గృహాల్లో చోరీలు, ఇతర నేరాలు జరగకుండా ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని ఉచితంగా కల్పిస్తామన్నారు. ఊళ్లు వెళ్లే గృహస్తులు ఇళ్లల్లో విలువైన నగలు, నగదు ఉంచరాదన్నారు. ఇళ్లకు కాపలాగా ఎవరినైన నియమించుకోవాలని సూచించారు.

జూదాలు ఆడితే కఠిన చర్యలు

సంక్రాంతి పర్వదినాల పేరుతో గ్రామాల్లో కోడిపందేలు, గుండాట, జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై కృష్ణమాచారి హెచ్చరించారు. అన్నిగ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. హెచ్చరికలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జూదాలు ఆడి తీవ్రంగా నష్టపోకుండా సంప్రదాయ క్రీడలు, ముగ్గుల పోటీలు, యువజనోత్సవాలతో పండగను జరుపుకోవాలని సూచించారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడిగా సత్తిబాబు



గోకవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా గోకవరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బత్తుల సత్తిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రాము సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బత్తుల సత్తిబాబు మాట్లాడుతూ తనపై విశ్వాసంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. బత్తుల సత్తిబాబును రాజకీయ నాయకులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు అభినందించారు.

యువత జూదాల జోలికి వెళ్లొద్దు

పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



కోటనందూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ శ్రీహరిరాజు

కోటనందూరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో యువత పేకాట, గుండాట, కోడి పందేలు, బెట్టింగులు వంటి జూద క్రీడల జోలికి వెళ్లవద్దని పెద్దాపురం డీఎస్పీ ఎస్.శ్రీహరిరాజు సూచించారు. జూద క్రీడలు వద్దు-సంప్రదాయ క్రీడల ముద్దు కార్యక్రమంలో భాగాంగా స్థానిక పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్, రంగవల్లుల పోటీలను తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను యువత సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలంతా సంతోషంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు క్రీడా పోటీలు కొనసాగుతాయని, విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఎస్సై తెలిపారు.

ముద్రగడను కలిసిన దళిత నాయకులు



కిర్లంపూడిలో ముద్రగడను కలసిన ఏలేశ్వరం మండలానికి చెందిన దళిత నాయకులు

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలానికి చెందిన పలువురు దళిత నాయకులు శనివారం కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబులను మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గిరిబాబు వారికి సూచించారు. కార్యక్రమంలో బత్తిన శ్రీనివాస్, గుండిపల్లి చక్రం, వసంత యోహన్, పేకల జాన్, రాచర్య రమేష్, పోతల ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

తేటగుంటలో ఎమ్మార్పీఎస్ సమావేశం



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తుని రూరల్: రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 5 నాటికి ఎమ్మార్పీఎస్ ఉద్యమ పునర్నిర్మాణ కమిటీలు పూర్తి చేయాల్సి ఉందని జిల్లా పలివెల శివమణ పేర్కొన్నారు. మండలంలోని తేటగుంటలో శనివారం చింతాడ నాగేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివమణి మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరంలో వర్గీకరణ అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్ ఉద్యమ పునర్నిర్మాణ, అనుబంధ కమిటీల నియమకానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను నియమించే బాధ్యతలను సీనియర్ నాయకులకు అప్పగించినట్టు తెలిపారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపారపు ప్రకాశరావు, ముప్పిడి దానియేలు, మార్లపూడి రాజు, గంటేటి లోవరాజు, సలగల సత్యనారాయణ, కాపారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై రగడ

- లంపకలోవలో ఏకపక్షంగా ఉపాధి హామీ పనులు
- సామాజిక తనిఖీల్లో బయటపడ్డ బినామీ మస్తర్లు
- రూ.2.84 లక్షల రికవరీకి ఆదేశాలు

ప్రత్తిపాడు: లంపకలోవ గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతిపై సామాజిక తనిఖీ ప్రజా వేదికలో రగడ చోటు చేసుకుంది. నిధులు దుర్వినియోగం చేసిన ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆ గ్రామ సర్పంచ్ వర్గీయులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వర్గీయులు గ్రామంలో జరిగిన అవినీతిని డ్వామా పీడీకి వివరించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సర్పంచ్ ప్రమేయం లేకుండానే గ్రామ సభ తీర్మానాలు ఏకపక్షంగా చేశారని ఆరోపించారు. గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లని, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారి పేర్లతో మస్తర్లు వేసి, ఉపాధి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని సర్పంచ్ వర్గీయులు డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు.

అన్ని గ్రామాల్లో బినామీ మస్తర్లు

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో రూ.11,74,49,391లతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, హార్టీకల్చర్, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ, ఎస్ఎస్ఏ పనులు జరిగాయి. ఈ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో అన్ని పంచాయతీల్లో బినామీ మస్తర్లు వెలుగు చూశాయి. పంచాయతీల్లో జరిగిన పనులను తెలియజేసే బోర్డులు లేవు. ఉపాధి పనుల్లో పాల్గొన్న వేతనదారుల వేలిముద్రలు, సంతకాలు లేకుండా వేతన చెల్లింపులు జరిగాయి. మస్తర్లలో దిద్దుబాట్లు, కొట్టివేతలు, సర్దుబాట్లు ఉన్నాయి. చేసిన పనుల కొలతల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. పెదశంకర్లపూడిలో ఉపాధి పనుల్లో పాల్గొనకపోయినా సుమారు వంద రోజులకు పైగా వేతనాలు చెల్లింపులు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, డ్వామా ఏపీడీ భాను ప్రకాష్, సామాజిక తనిఖీ సూపర్‌వైజర్ రవి శంకర్, ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఏపీఓలు కుమారస్వామి, ఏవీబీ నాయుడులతో పాటు ఎంపీటీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందికి రూ.15 వేల జరిమానా

ప్రత్తిపాడు మండలంలోని జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి జరిగినట్టు గుర్తించి రూ.2,84,273 రికవరీకి ఆదేశించినట్టు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందికి రూ.15 వేలు జరిమానా విధించామన్నారు. మండలంలో మృతి చెందిన నలుగురికి మస్తర్లు నమోదు చేసినట్టు గుర్తించామన్నారు. లంపకలోవలో ఉపాధి హామీ పథకం సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు.



ప్రత్తిపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

సామాజిక తనిఖీ ప్రజావేదిక

జగ్గంపేట: మండలంలోని 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారి ఎం.భాను ప్రకాష్ ఆధ్వర్యంలో సిబ్బంది పనులను తనిఖీ చేశారు. మండలంలో 763 పనులకు గాను వేతన రూపంలో రూ.8,05,18,420, మెటీరియల్ రూపంలో రూ.2,73,30,047 వెరసి మొత్తం రూ.10,78,48,467 ఖర్చు చేసినట్లు తెలిపారు. 16 గ్రామ పంచాయతీల నుంచి రూ.32 వేలు సిబ్బందికి, ఫైన్ రూపంలో రూ.5,83,050 రికవరీ చేసినట్లు చెప్పారు. కాట్రావులపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ జి.సత్యరాజును సస్పెండ్ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఆర్‌పీ టి.నందిని, సామాజిక తనిఖీ బృందం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కష్టపడాలి



సినీ నటుడు కిరణ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆదిత్య యాజమాన్యం

గండేపల్లి: జీవితంలో గోల్ సాధించేందుకు ప్రతి విద్యార్థి కష్టపడాలని సినీ హీరో కిరణ్ అబ్బవరం సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జరుగుతున్న కలర్స్ ప్రోగ్రాంలో చివరి రోజు శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. తాను హీరో అవుతానంటే అందరూ నవ్వారని, అది పట్టించుకోకుండా ప్రయత్నించి ఇప్పుడు హీరోగా మీ ముందు ఉన్నానని తెలిపారు.

ట్రాఫిక్‌లో జిల్లా కలెక్టర్

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జరుగుతున్న కలర్స్ కార్యక్రమానికి వస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పెద్దాపురం పాండవుల మెట్ట వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. కలర్స్‌ను తిలకించేందుకు ఆదిత్యకు వస్తున్న వాహనల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు 80,000 మంది చివరి రోజు కార్యక్రమానికి హాజరైనట్టుగా ఆదిత్య సిబ్బంది అంచనా వేస్తున్నారు.

సంక్రాంతి పండగ.. ఆనందం నిండుగా..

- విద్యాసంస్థల్లో వైభవంగా సంక్రాంతి సంబరాలు
- ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు
- ఆకట్టుకున్న వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు



పెద్దిపాలెంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



సూరంపాలెం ప్రగతిలో విద్యార్థులతో కలిసి భోగి మంట వెలిగిస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణారావు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిపారు. విద్యార్థినులు రంగురంగుల రంగవల్లులు వేశారు. భోగి మంటలు, సంక్రాంతికి స్వాగతం పలికే రంగవల్లులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం మేనేజర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు. యర్రవరంలోని విజ్ఞానజ్యోతి కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు వేసి సంబరాలు ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

గండేపల్లి: విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ అలవరుచుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫ్రైడ్స్ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు శనివారం సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన త్రోబాల్, వాలీబాల్, క్రికెట్, జావెలిన్, రన్నింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు సందడి చేశారు. గాలి పటాలు ఎగురవేశారు. భోగి మంటలు, హరిదాసు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ప్రిన్సిపాల్ జి.నరేష్, ఎం.సతీష్, డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో...

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పలువురు మహిళలు ప్రకృతి వ్యవసాయానికి అద్దం పట్టే రీతిలో రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో చెన్నంశెట్టి సుధ ప్రథమ, సారిపల్లి మణి ద్వితీయ, బర్ల స్వాతి తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు వెలుగు ఏపీఎం వెంకట్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల టీం లీడర్ నికేష్ వర్మ, మాష్టర్ ట్రైనర్స్ రామరాజు, చిన్నబాబు, యూనిట్ ఇన్‌చార్జ్ రామకృష్ణ, వీఓఏలు నూకరత్నం, భవాని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కారు ఢీకొట్టిన ఘటనలో గాయపడిన జాన్

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు జాతీయరహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... ఏవీ నగరానికి చెందిన ఏడిద జాన్ తన మేనత్త చిట్టెమ్మను తీసుకుని బైకుపై బెండపూడి వెళ్లేందుకు బయలుదేరారు. రావికంపాడు విద్యుత్‌సబ్‌స్టేషన్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా వైజాగ్ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో జాన్‌కు కాలువిరిగి తీవ్రగాయాలవ్వగా మేనత్త చిట్టెమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వైద్యం నిమిత్తం వారిని అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కాకినాడ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపారు.